

# చదువు

\- ప్రతాప వెంకట సుబ్బారాయుడు

"చీకటి పడుతోంది.. పిల్లలు ఎదురు చూస్తుంటారు.. ఇంక పోదామా?" అన్నాను.

"పదండి" నీరజ లేచింది.

ప్రతివారం శనివారం సాయంత్రం నేను, నీరజ పార్కుకి వెళ్ళి... అక్కడ కాసేపు మాట్లాడుకోవడం మాకు అలవాటు. ఇలా అని మేమేదో కుర్రజంట అనుకుంటే పొరపాటే మాకు పెళ్ళయి పాతిక సంవత్సరాలయింది.కానీ మా ఇద్దరి మధ్య వున్న అన్యోన్యత చూసిన వాళ్ళెవరూ అలా అనుకోరు.

అర్థగంట నడుస్తూ వెళుతుంటే.. హఠాత్తుగా నా కాళ్ళకి బ్రేకులు పడ్డాయి. కారణం రంగారావు కొడుకు రాజేష్.. ఎవరో అమ్మాయి ఒళ్ళో పడుకుని నవ్వుతూ ఏదో మాట్లాడుతున్నాడు.. దానికి ఆమె చిరుకోపం నటిస్తూ.. చేతితో కొడుతోంది.

ఉన్నట్టుండి నేనలా స్థాణువులా అయ్యేసరికి.. మా ఆవిడకి ఏమీ అర్థం కాలేదు.

"ఏమయింది" అడిగింది.

'ఏమీలేదు పదా' అన్నాను.

నాకు మనసంతా ఏదోలా వుంది.. నాకే ఇలా వుంటే రంగారావుకి ఎలా వుంటుంది? రంగారావు తన కొడుకు ప్రేమలో పడ్డాడంటే తట్టుకోగలడా?

నా కళ్ళముందు గతం స్పష్టంగా కదలాడుతోంది.

* * *

రంగారావు నేను ఆ కంపెనీలో ఒకేసారి చేరాం.

ఇద్దరి అభిరుచులూ కలవడంతో స్నేహితులమవడానికి ఎక్కువ సమయం పట్టలేదు.

రంగారావుని బాగా అధ్యయనం చేశాక నాకు అర్థమయిందేమిటంటే రంగారావుకి చదువంటే పంచప్రాణాలు. తన చిన్నప్పుడు చదువుకోవాలని ఎంతగానో కలలు కన్నాడట. కాని వాళ్ళ నాన్నకున్న బాధ్యతల వల్ల చదివించలేక పోయాట్ట. అందుకనే ఈ గుమాస్తాగిరి చేయాల్సి వస్తోందని.. లేకపోతే చదువు పట్ల తనకున్న ఆసక్తికి ఉన్నత స్థాయిలో వుండేవాడినని అంటుండేవాడు. జీతాలు రాగానే ఇంటికి స్వీట్లు.. హాట్లు.. లాంటివి కాకుండా వాళ్ళ పెద్దబ్బాయి రాజేష్‌కి రకరకాల సబ్జెక్ట్ బుక్స్ కొనుక్కుని తీసుకెళ్ళేవాడు. 'అదేంట్రా అంటే..' 'అప్పుడే వాడికి చదువులో ఎటువంటి ఇబ్బందీ కలగకూడదు.. వాడు కష్టంగా కాకుండా ఇష్టంగా చదవాలి.. వాడికి ఏ సబ్జెక్ట్ అన్నా కూడా భయం కలగకూడదు. అందుకే నా ప్రయత్నం' అనేవాడు.

వాడు ఉద్యోగం పట్ల చాలా శ్రద్ధ చూపేవాడు.. అందువల్ల వాడి జీతం బాగా వుండేది. అయినా తన సుఖం కోసంగాని.. తన భార్య కోసం గాని నయా పైసా ఖర్చు పెట్టేవాడుకాదు. ఆఫీసు దూరమైనా సైకిల్ తొక్కుకుంటూ వచ్చేవాడు గాని స్కూటర్ కొనుక్కునేవాడు కాదు. ఒక్క మాటలో చెప్పాలంటే వాడు కష్టజీవి.. కొడుకుని ఉన్నత స్థాయిలో

చూడడం కోసం తన సుఖాలన్నీ త్యాగం చేసిన శ్రమజీవి. వాడిని చూస్తే కోపం వచ్చేది.. ఒక్కోసారి జాలి వేసేది.

వాళ్ళబ్బాయికి పరీక్షలయితే రాత్రి తెల్లవార్లు వీడూ కూర్చునేవాడు. వాళ్ళబ్బాయి ఒంటరితనం ఫీలవ కూడదని. పొద్దున్నే ఎర్రటి కళ్ళతో ఆఫీసుకి వచ్చేవాడు. 'రావూ మీకు పిచ్చితనం ఎక్కువవుతోందిరా.. మీ అబ్బాయి అంతగా ఒంటరితనం ఫీల్ అయితే ఫ్రెండ్స్‌తో కంబైన్డ్ స్టడీ చేయమను. అంతేగానీ ఉద్యోగివి నీవిలా కుర్రాడిలా జాగారం చెయ్యడం?' అని నేనంటే సమాధానంగా నవ్వేవాడు.

వాళ్ళబ్బాయి మంచి మార్కులతో పాసు అయితే ఇహ రంగారావుకి కాళ్ళు భూమ్మీద ఆనేవి కావు. అందరికీ స్వీట్లు పంచేవాడు. ఒక్కొక్కరికీ పదిసార్లు చెప్పి విసిగించేవాడు.

అలా వాళ్ళబ్బాయి ఇంటర్ పూర్తి చేసి ఎంసెట్లో మంచి ర్యాంకు తెచ్చుకుని ఇంజనీరింగులో చేరాడు.

* * *

అరుగాలం కష్టపడ్డ రంగారావుకి ఫలసాయం అందబోతున్న సమయంలో.. ఇలా రాజేష్ ఒకమ్మాయితో... వాడికి తెలిస్తే గుండె పగిలిపోతుంది. నాకేం చేయాలో పాలు పోవడం లేదు.

రాత్రంతా నాకు కలత నిద్రే.

మరునటి రోజు ఆదివారం.

ఏదైతే అది అయింది.. వాడికి తెలియడమే మంచిదన్న నిర్ణయానికి వచ్చాను.

రంగారావు ఇంటికి బయల్దేరాను.

నేను వెళ్ళేసరికి వాడు పేపరు చదువుతున్నాడు. నన్ను చూడగానే "రారా ఇంత పొద్దున్నే నీకు నన్ను చూడాలనిపించడం నా అదృష్టం.. లక్ష్మీ! రాఘవ వచ్చాడు. టిఫిన్ తీసుకురా.." అని భార్యకి పురమాయించాడు.

నేను కొద్దిసేపు మౌనంగా వుండి "రాజేష్ లేడా?" అడిగాను.

"లేడురా ఇప్పుడే వాళ్ళ స్నేహితుడి ఇంటికి వెళ్ళాడు. ఒక గంటలో వస్తానన్నాడు" చెప్పాడు.

"నేను ఉపోద్ఘాతంగా" ఒరే ఇప్పుడు నేను చెప్పబోయేది నిన్ను తీవ్రంగా హర్ట్ చేయవచ్చు.. కాని నువ్వు అంత సీరియస్‌గా తీసుకోకూడదు. సరేనా.. అలా అయితేనే చెబుతాను.." అన్నాను.

"అబ్బో అంత సీరియస్ మేటరా.. సరే చెప్పు వింటాను" అన్నాడు.

నేను నిన్న సాయంత్రం పార్కులో చూసిన దృశ్యం చెప్పాను.. 'ఇది నా అనుమానం మాత్రమే.. ఇద్దరూ రేపు అలా మళ్ళీ కలిసి తిరుగుతున్నారు వాళ్ళ ఆలోచనలు వాళ్ళకి వుంటాయి. అభివృద్ధి పథంలో కలసి అడుగేస్తున్నారు. అన్నీ అనుమానించాల్సిన పనిలేదు. నువ్వు నిజం నిదానంగా తెలుసుకో.. ఒక్కటి మాత్రం గుర్తుంచుకో మనం పిల్లల్ని కంటాం గానీ వాళ్ళ రాతల్ని కాదుగా..' అంటూ ముగించాను. నేను చేసిన తప్పేంటంటే మధ్యలో వాడి వంక చూడక పోవడం. గుండెకి బాణం దెబ్బ తగిలినట్టు విలవిలలాడి పోతున్నాడు వాడు. వాడిని చూస్తే నాకే భయమేసింది. "ఏమైందిరా..?" ఆందోళనగా అడిగాను. వాడు ఏమీ లేదన్నట్టుగా సంజ్ఞ చేశాడు. నేను మందలిస్తున్నట్టు "నేను ముందే చెప్పాను నువ్వు రియాక్ట్ అవ్వొద్దని" అన్నాను. వాడు పేలవంగా నవ్వి "రియాక్ట్ కాకుండా ఎలా వుంటాన్రా.. నా శ్రమ అంతా బూడిదలో పోసిన పన్నీరవుతుంటే..అన్నాడు." "ఒక వేళ అదే అయినా నువ్వూ నేనూ చేయగలిగిందేమీ లేదు.. రాతనెవరూ తప్పించలేరు కదా" అన్నాను.

మేము మాటల్లో వుండగానే రాజేష్ వచ్చాడు.

రాజేష్ కాస్త ఆలస్యంగా వచ్చి నాగుండెదడనిపించింది.

రంగారావు రాజేష్ వంక తీక్షణంగా చూస్తూ "ఏరా ఈ మధ్య పార్కుల్లో అమ్మాయితో తిరుగుతున్నావట" అన్నాడు.

రాజేష్ నావంక చూస్తూ "ఇన్ఫర్మేషన్ బాగానే అందిందే" అన్నాడు వెటకారంగా.

ఆ తర్వాత "అవును తిరుగుతున్నాను.. టైము వచ్చింది కాబట్టి చెబుతున్నాను ఆ అమ్మాయి పేరు జాహ్నవి. ఇండస్ట్రియలిస్ట్ ముకుందరావు గారి అమ్మాయి.. మేమిద్దరం ప్రేమించుకున్నాం.. త్వరలో పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాం." అన్నాడు.

"మరి నీ చదువు?" బాధగా అడిగాడు రంగారావు.

"చదువుతాను..కానీ నా చదువు నీకు ఉపయోగపడదు" అన్నాడు.

"బాబూ రాజేష్ తప్పమ్మా అలా మాట్లాడ కూడదు.. మీ నాన్న నీ కోసం.." మాట్లాడబోతున్న నన్ను మధ్యలోనే అడ్డుకుని "నీకు తెలియదంకుల్ ... నన్ను చిన్నప్పట్నుంచి మా నాన్న చదువు పేరుతో ఎంత టార్చర్ పెట్టాడో.. నా వయసు పిల్లలందరు ఆటపాటలతో గడిపితే నేను మాత్రం ఆయనకి భయపడుతూ పుస్తకాలతో గడిపేవాణ్ని. పరీక్షలకి ఎక్కడ చదవనో అని రాత్రి తెల్లవార్లు సెంట్రీ కాపలా కాచేవాడు. చదువు.. చదువు.. అది తప్ప నా జీవితంలో మరే విశేషమూ వుండేది కాదు. ఆయన చేతుల్లో ఒక్కటి... ఒక్కటంటే ఒక్క ఆట వస్తువూ కొనలేదు. ఏది తెచ్చినా అది చదువుకి సంబంధించినదే. నిజానికి ఆయన ట్రీట్మెంటుకి నేను ఆనాటికి పిచ్చాసుపత్రిలో వుండాలి."

ఎన్నాళ్ళుగానో గుండెల్లో గూడు కట్టుకున్న ఆక్రోశం అనర్గళంగా బయటకొస్తోంది.

"ఇన్నాళ్ళూ నా జీవితాన్ని ఆయన కోసం జీవించాను.. ఇహ నాది.. కేవలం నాది. నాకిష్టమైనట్టుగా జీవిస్తాను.. నన్ను శాసించే హక్కు, అధికారం ఎవరికీ లేదు"

రంగారావుకి బాధతో గొంతు పెగలడం లేదు.. 'తనని ఎంతగా అపార్థం చేసుకున్నాడు?' మనసులో అదే ప్రశ్న విశ్వరూపం దాలుస్తోంది.

"అదికాదు రాజేష్.. తనకి చదువంటే ఎంత ఆసక్తి వున్నా, చదవలేకపోయాడు మీ నాన్న.. జీవితంలో ఎన్నో ఎదురుదెబ్బలు తిన్నాడు. నీకోసం నిద్దర్నా చక్కగా చదివించి.."

" ఆс చదివించి.. తను కాలు కింద పెట్టకుండా సుఖపడాలనుకున్నాడు.. తన కాంక్షకి కొడుకు జీవితాన్ని బలిచేద్దామనుకున్నాడు.. అందుకే నా మీద పెట్టుబడి పెట్టాడు.. నా కళ్ళు ఏనాడో తెరుచుకున్నాయి.. కాని ఏం చెయ్యను? ఈయన గారి దొడ్డైనికి బలైపోయాను. అందుకే ఈయన మీద కక్ష సాధించే సమయం వచ్చింది. ఈయన కోరుకున్నట్టే నేను ఉన్నత స్థితికి వెళతాను. కాని ఈయనని సుఖ పెట్టలేను. నేను ఎంత అవస్థతో అనుభవించానో దానికి రెట్టింపు ఈయన అనుభవించాలి. జాహ్నవి వాళ్ళ నాన్న వాళ్ళ సంస్థలో నాకు జాబ్ ఇస్తానన్నారు. నేను ఇంట్లోంచి ఇప్పుడే వెళ్ళి పోతున్నాను. నేనిప్పుడు స్వేచ్ఛాజీవిని.." అని లోపలికి వెళ్ళిపోయాడు.

రంగారావుకి కాదు రాజేష్ మాటలు నాకూ షాకే? ఛీ..ఛీ..ఏంటీ.. చదివించిన తండ్రి మీద ఎంత ద్వేషం? అతని ఉన్నతి కోసం తన సమస్తాన్నీ త్యాగం చేస్తే, దాన్ని వ్యాపారంతో పోల్చాడు.. నాకే ఇంతబాధ అనిపిస్తే ఇంక రంగారావుకి ఎలా ఉంటుంది? వాడి వంక చూశాను.

వాడు సోఫాలోకి వాలిపోయివున్నాడు.. నేను ఆందోళనగా వాళ్ళావిడని కేకేశాను. ఆవిడ వంటింట్లోంచి మా మాటలు వింటోందనుకుంటా కళ్ళు తుడుచుకుంటూ పరుగు పరుగున వచ్చింది.

కనీసం తండ్రి వంకైనా చూడకుండా బ్రాండెడ్ బ్యాగుతో బయటకు రాజేష్ వెళ్ళిపోయాడు.

నేను సెల్ ఫోన్లో మా డాక్టర్కి విషయం చెప్పి రమ్మన్నాను.

డాక్టరు అంబులెన్స్‌తో సహా వచ్చి "ఈయనకు తీవ్రమైన హార్ట్ స్ట్రోక్ వచ్చింది..వెంటనే హాస్పిటల్లో అడ్మిట్ చేయాలి" అన్నారు. నా కళ్ళు వర్షిస్తూనే వున్నాయి. 'నా మూలానే ఇదంతా జరిగింది' అన్నభావన నా మనసుని పిండేస్తోంది.

రంగారావుకి ప్రాణ గండం తప్పింది కాని కాళ్ళు, చేతులూ చచ్చుబడిపోయాయి.. నిజానికి కొడుకు దయవల్ల అదిప్పుడో జరిగింది. ఇప్పుడు వాడో జీవచ్ఛవం.

# కిరాతక ప్రేమ



ఇది ప్రేమ కోసం
తాజ్ మహల్ నిర్మించే కాలం కాదు
ఇది ప్రేయసి కోసం పరితపిస్తూ
ప్రాణం హారతి కర్పూరం చేసుకునే కాలం కాదు
తనకి నచ్చిన పిల్ల కాదనంటే
వేట కొడవలితో కుత్తుక తెగ్గోసే కలికాలం
యాసిడ్ ముఖానపోసి శాడిజం చూపించే కాలం
మనకి కీచక రాజ్యం తెలుసు
రావణ రాజ్యం తెలుసు
మనముంటున్నది కిరాతక ప్రేమ సమాజం
ప్రేమ ఎదుటి వాళ్ళ క్షేమం కాంక్షిస్తుందని తెలుసు
కాని మరణ శాసనం రాస్తుందన్నది కొత్త సిద్ధాంతం
అమాయకమైన ఆడపిల్లలూ
మీ పరిధిలో మీరున్నా
మీ జీవితాల్ని కాటేసే మిన్నాగులు మీ చుట్టూ ఉన్నాయి
తస్మాత్ జాగ్రత్త! జాగ్రత్త!!

- ప్రతాప వెంకట సుబ్బారాయుడు